క్లుప్తంగా

శాకాహారాన్ని తీసుకోండి



తెనాలిఅర్బన్: శాకాహారాన్ని ప్రతిరోజు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ది తెనాలి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ జాస్తి సుబ్బారావు పేర్కొన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో బీసీ కాలనీ నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత ఆహారం శాఖాహారమని చెప్పారు. అహింసను వదిలేసి, శాఖాహార ప్రియులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, మధు, సౌజన్య పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రత మహోత్సవం



తెనాలిటౌన్: పట్టణంలోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఉచిత సామూహిక శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఆంజనేయస్వామి సంకీర్తనా బృందం, సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో 111 మంది దంపతులు పాల్గొన్నారు. వైఖానస పండితులు, ఆలయ వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, యాజ్ఞికులు రఘురామ్, అద్దేపల్లి హరికృష్ణ దంపతులకు పూజా సామగ్రిని అందజేశారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు ఎస్.బి.శివ, ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి దంపతులు, బృందం అధ్యక్షులు మూర్తి వెంకటేశ్వరరావు, అనురాధ దంపతులు, సేవా సమితి అధ్యక్షులు ఆర్.వి.కిరణ్‌కుమార్, సభ్యులు రమణకుమారి, గుడివాడ బాలకృష్ణ, ఎం.చంద్రశేఖర్, ఆర్.సురేష్, ఎం.వెంకటేశ్వరరావు, బి.లీలాప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ కొలుపులు



కొల్లిపర: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన శ్రీగంగానమ్మ కొలుపులు భక్తుల పూజా కార్యక్రమాలతో ఆదివారం ఘనంగా ముగిసాయి. 15 రోజులుగా గ్రామంలో గంగానమ్మ ప్రతి రూపమైన ఘటాన్ని ఊరేగింపు చేశారు. ఉదయం 6 గంటల నుంచి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి, గ్రామ శివారులోని ఆలయానికి తీసుకువచ్చారు. భక్తులు వేలాదిగా తరలి వచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. పెద్దలు, చిన్నారులు, మహిళలు వారి మెడలో గారెలు, బూరెల దండలు వేసుకుని, మొలకెత్తిన గింజలు మూకుళ్లతో అడుగులు, మడుగులు పాటిస్తూ బంధువులతో కలసి ఆలయం వద్దకు వచ్చారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పుష్ప దంపతులు సాధారణ భక్తులతో కలిసి మొక్కులు తీర్చుకున్నారు. కొలుపుల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాసరెడ్డి సహకారంతో ఎస్‌ఐ రవీంద్రరెడ్డి తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వాసవీ మాత ఆలయంలో కోటి దీపోత్సవం



తెనాలి: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా స్థానిక బోసు రోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం కోటి దీపోత్సవం నిర్వహించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, కుమారుడు యశ్వంత్ గుప్తా, కుమార్తె దేవిక ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో కార్తీక మాసాన కోటిదీపోత్సవం నిర్వహణ ఇది రెండో ఏడాదిగా తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో మధువని సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు వి. మధుబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. స్వరాల సంగమం పేరుతో నిర్వహించిన విభావరిలో పలు చిత్రాల్లోని పాటల్నిగాయకులు యస్. సాంబశివరావు, సీహెచ్. రవికాంత్, డి.టి. సాయిబాబా, పత్రి గాయత్రీదేవి, అత్తోట సౌజన్య, జరీనా ఆలపించారు. పి. కృష్ణారావు వ్యాఖ్యాతగా వ్యవహరించగా, కె. శివప్రసాదరావు పర్యవేక్షించారు.

వైభవంగా కార్తిక వన సమారాధనలు



ఎంపీపీ చెన్నకేశవులను సత్కరిస్తున్న రజక సంఘీయులు



యాదవరాజుల వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: కార్తిక వన సమారాధనలు వివిధ కుల సంఘాలు ఆదివారం వైభవంగా నిర్వహించాయి. పట్టణంలోని సుల్తానాబాద్‌లో ఉన్న ఓంకార ఆశ్రమంలో హోల్ సేల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఆశ్రమంలో పూజలు జరిపారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. అసోసియేసన్ కార్యదర్శి దేసు యుగంధర్, ప్రెసిడెంట్ చుండూరు నాగమల్లికార్జునరావు పర్యవేక్షించారు.

- వైకుంఠపురంలో పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, డాక్టర్ కె.పురుషోత్తం, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను సంఘీయులు సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్కల శ్రీరామ్, కొడాలి క్రాంతికుమార్, జొన్నాదుల మహేష్, అదే బాలచంద్రమౌళి, సంఘీయులు పాల్గొన్నారు.
- మార్కెట్ యార్డు ఆవరణలో చంద్రవంశ క్షత్రియ యాదవ రాజుల ఆధ్వర్యంలో కార్తిక మాస వన సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాలయ రాజనారాయణ, యాదవ సంఘీయులు పాల్గొన్నారు.
- చినరావూరులోని గంగానమ్మతల్లి గుడిలో రజక సంఘీయులు కార్తిక వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథి తెనాలి ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులను ఘనంగా సత్కరించారు. సుంకర కొండలరావు, ప్రభాకరరావు, ఓలేటి శివాజీ, కౌన్సిలర్స్ వి.విజయలక్ష్మి, పి.లక్ష్మీ లావణ్య, సంఘీయులు పాల్గొన్నారు.
- బోసు రోడ్డులోని రాజ్యం టాకీస్ ఆవరణలో అగ్నికులక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రులు కొల్లి రవీంద్ర, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సైకం లక్ష్మణరావు, చిన్నారి, కేసన శంకరరావు, తోటకూర రమణరావు, కన్నా వెంకట్రావు, సంఘీయులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అంగలకుదురు సదస్సులో మాట్లాడుతున్న కె.రవిబాబు

తెనాలి: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ కె.రవిబాబు కోరారు. పథకాలపై దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రచార అవగాహన కార్యక్రమం 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' ఆదివారం నుంచి తెనాలి నియోజకవర్గంలో ప్రారంభమైంది. తొలిరోజున రూరల్ మండల గ్రామాలైన అంగలకుదురు, సంగం జాగర్లమూడిలో సదస్సులు నిర్వహించారు. తహసీల్దారు రవిబాబు మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నవంబరు 15 నుంచి ఆరంభించినట్లు చెప్పారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఆర్థిక సాయం, ఎల్‌పీజీ కనెక్షన్లు, ఇళ్ల నిర్మాణం, ఆహారభద్రత, పోషకాహారం, ఆరోగ్యం, తాగునీరు, నాణ్యమైన విద్య కోసం భారీ స్థాయిలో నిధులను కేటాయించి అమలు చేస్తోందని చెప్పారు. కేంద్రం అమలుచేస్తున్న పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయా? లేదా? అనేది పరిశీలించటం, ఆయా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించటం సంకల్పయాత్ర ప్రధాన ఉద్దేశంగా చెప్పారు. నియోజకవర్గంలో రోజుకు రెండు గ్రామాల చొప్పున ఈ ప్రచార యాత్ర ఉంటుందని వివరించారు. తెనాలి ఎంపీడీవో ప్రతాపరెడ్డి తన ప్రసంగంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర దేశ వ్యాప్త అవగాహన ప్రచార కార్యక్రమమని చెప్పారు. కేంద్రప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని, అర్హులైన వారు లబ్ధిని పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం జిల్లా ప్రతిభా అధికారిగా నియమితులైన ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి సోలోమన్ ఆరోకియరాజ్ పర్యవేక్షిస్తున్నారని వివరించారు. సంగజాగర్లమూడి గ్రామంలోని పంట భూములన్నీ డిజిటలైజ్ అయ్యాయని, ఇందుకుగాను ప్రధాన మంత్రి నుంచి సర్టిఫికెట్ వచ్చిందని సదరు ధ్రువీకరణను ప్రజలకు చూపారు. అంగలకుదురు, సంగం జాగర్లమూడి గ్రామాల పంచాయతీల కార్యదర్శులు జి.ప్రసాదరావు, విద్యాసాగర్, మండల వ్యవసాయ అధికారి ప్రేమసాగర్, బీజేపీ అధికారప్రతినిధి, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు పాటిబండ్ల రామకృష్ణ, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కఠారి వాసుదేవనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కడియాల నందకిశోర్ పాల్గొన్నారు.

నేడు 9, 27 వార్డుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్'

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని 9, 27 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ వార్డు లక్ష్మీనగర్ కాలనీ సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు, 27వ వార్డు చెంచుపేటలోని సచివాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే సచివాలయాలలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



కొల్లిపర: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలని తహసీల్దారు జి.నాంచారయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వివిధ గ్రామాల్లో ఎంత మంది బీఎల్వోలు అందుబాటులో ఉన్నారో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో అవతవకలు జరిగితే.. బీఎల్వోపై చట్టపరమై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసరావు, కంప్యూటర్ ఆపరేటర్ ఈమని సురేంద్రరెడ్డి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వాతావరణానికి అనుకూలమైన పంటలు వేయాలి



రైతులకు చిత్రాలలు ద్వారా వివరిస్తున్న విద్యార్థులు

తూములూరు(కొల్లిపర): వాతావరణానికి అనుకూలమైన పంటలు వేయటం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు అరుణ, అషిత, భారతి, చంధన, భార్గవి అన్నారు. ఆచార్య ఎన్.జి రంగా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని తూములూరు గ్రామంలో ఆదివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం ద్వారా స్థానిక వ్యవసాయ క్షేత్రాల్లో విద్యార్థులు మూడు నెలల నుంచి విజ్ఞానాన్ని నేర్చుకుంటూ.. రైతులకు పంటలు వేసే సమయంలో కాలానుగుణ క్యాలెండర్, పంటల తెగుళ్లపై చిత్ర రూపంలో వివరించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాదానాలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు గ్రామంలోని మెంటార్స్ రైతులు కొండా కిషోర్‌రెడ్డి, వింతా వేణుగోపాలరెడ్డి, డాక్టర్ శ్రీలతావాణి, డాక్టర్ వై.బింద్యా పకృతి వ్యవసాయం గురించి పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు సత్కారం

తెనాలిరూరల్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిసెంబరు నెల సమావేశాన్ని తెనాలి మండలం పెదరావూరులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు దాటిన అసోసియేషన్ సభ్యులు మల్లెపెద్ది హనుమంతరావు, ఎస్. వెంకటేశ్వరరావు, కె. చంద్రమౌళి, వై. సభాష్‌చంద్రబోస్, యార్లగడ్డ హనుమంతరావు, నరసింహారావును సత్కరించారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, గుత్తా వెంకటరత్నం, జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మారొతు సీతారామయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. షేక్‌ఖాదర్ బాషా, మల్లికార్జునరావు పర్యవేక్షించారు.

17న రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీలు

పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 17న రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ డాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. కల్యాణ్ తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కల్యాణ్ మాట్లాడుతూ సబ్ జూనియర్స్, సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో వెస్ట్రన్, క్లాసికల్, ఫోక్ డాన్స్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 17న ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. సాయంత్రం మెగా ఈవెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 9వ తేదీలోపు పేర్లను 8897508897 నంబర్‌కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో కార్యదర్శి పి. అరుణ్‌కుమార్, సహాయ కార్యదర్శి వై. దుర్గారామ్, ఉపాధ్యక్షులు జె. చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సామాజిక పింఛన్ల పంపిణీ



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం ఆదివారం కొనసాగింది. వార్డు వలంటీర్‌లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు పంపిణీ చేశారు. ఐతానగర్‌కు చెందిన చిన్నం వాణికి దివ్యాంగ పింఛన్‌ను వలంటీర్ సీహెచ్ ఉషాదేవి, యండ్రపాటి స్వాతికి డీఎంఅండ్ హెచ్ఓ పింఛన్ రూ.5000లు వెల్ఫేర్ సెక్రటరీ సీహెచ్ ఆనందరావు పంపిణీ చేశారు. గంగానమ్మ పేటకు చెందిన తుల్లిమిల్లి సాంబ్రాజ్యంకు వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ కోటిరెడ్డి అందజేశారు.

మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి విరాళం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాతలు ఆదివారం రూ.1,00,116 అందించారు. తాడేపల్లికి చెందిన మడితాటి శ్రీధర్ రెడ్డి, ప్రశాంతి దంపతులు ఆలయ అభివృద్ధికి విరాళాన్ని అందించినట్లు కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి తెలిపారు. దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు కృషిచేయాలి



మాట్లాడుతున్న ఆపస్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో దేశభక్తి, నైతిక విలువల్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ (ఆపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన సంఘ కోర్ కమిటీ సమావేశంలో ప్రతినిధి వై. శ్రీహరి పూర్ణప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు, పీఎఫ్ బకాయిలను చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘ రాష్ట్ర మహిళా కన్వీనర్ పి. పద్మ మాట్లాడుతూ ఈనెల 17న జరగనున్న నారీశక్తి సమ్మేళనాన్ని మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.బాల చంద్రారెడ్డి, కె. శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పి. వీరబ్రహ్మం, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి కుందుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా సంస్కార భారతి అధ్యక్షుడు ఇంద్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకల్ని పురస్కరించుకుని భరత మాత పూజా దినోత్సవాలలో భాగంగా మూడో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రకాశనం చేశారు. వందే మాతరం ప్రార్థన గీతంతో పోటీల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేతిరాత, ఇంద్రజాలం, దేశభక్తి బృంద గీతాల పోటీల్ని నిర్వహించారు. పిల్లల్లో దేశభక్తిని పెంచే పోటీల్ని ఏటా నిర్వహిస్తున్న సంస్థ కార్యవర్గాన్ని మస్తానయ్య అభినందించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో కంట్రోల్ రూం ఏర్పాటు

నెహ్రూనగర్: మిచౌంగ్ తుపాను దృష్టిలో పెట్టుకొని గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలకు ఎటువంటి సమస్యలు రాకుండా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూం 0863–23451038 కాల్ చేయవచ్చని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని బెయిల్ అవుట్ చేయడానికి ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఎక్కడైనా చెట్ల కొమ్మలు విరిగితే తొలగించడానికి పార్క్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడీహెచ్‌కి ఆదేశాలు జారీ చేశారు. మంచి నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ అంతరాయం సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా జనరేటర్లు ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. సచివాలయాల వారీగా కార్యదర్శులు, అధికారులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

బ్రాహ్మణ పరిషత్ భవనానికి త్వరలోనే స్థలం కేటాయింపు



ఉపకార వేతనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన, 118 మంది విద్యార్థులకు రూ.3.50 లక్షల ఉపకార వేతనాలు, నోట్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక తాలూకా జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటైన సభలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బ్రాహ్మణులకు అండగా ఉంటామని, పరిషత్ భవనానికి త్వరలోనే స్థలం కేటాయించనున్నట్లు ప్రకటించారు. పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన వేదగంగోత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వరప్రసాద్‌కు స్వర్ణకంకణ ధారణ చేశారు. పరిషత్‌కు సొంత భవనాన్ని నిర్మించి ఇస్తామని వరప్రసాద్ హామీ ఇచ్చారు. అన్నమయ్య జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్త ఓరుగంటి నవీన్, పినపాడులోని శృంగేరీ పీఠం దత్తన మంచి లక్ష్మీనరసింహశర్మ, పరిషత్ ఉపకార వేతనంతో చదువుకుని సింగపూర్‌లో ఉన్నతస్థాయిలో స్థిరపడిన చిలకలపూడి నాగహిమజను ఎమ్మెల్యే శివకుమార్ చేతుల మీదుగా సత్కరించారు. బ్రాహ్మణ విద్యార్థుల ఉపనయనాలకు సహకరిస్తానని జ్యోతిష్య పండితుడు జీవీఎల్ఎన్ ఆచార్యులు ప్రకటించి రూ.లక్ష విరాళం అందజేశారు. రెయిన్‌బో హాస్పిటల్స్ యాజమాన్యంలో ఒకరైన బాబూప్రసాద్ రూ.2 లక్షలు, ఓరుగంటి నవీన్ రూ.లక్ష చొప్పున పరిషత్‌కు విరాళాలను అందజేశారు. ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాల వినియోగదారుల కోర్టుల జడ్జిలు చిరంజీవి, శ్రీదేవి, రాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడారు. పరిషత్ అధ్యక్షుడు పరాశరం వెంకట రామగోపాల్, ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ, గౌరవ అధ్యక్షుడు పెద్దిరాజు సత్యనారాయణ, కార్పొరేషన్ డైరెక్టర్ త్రిపురారిభట్ల సత్యజ్ఞానప్రసూనాంబ, నందివెలుగు రామకృష్ణశర్మ, వడ్లమాని ఉమామహేశ్వరరావు పర్యవేక్షించారు.

చెత్తను కార్మికులకు అందజేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: చెత్తను మురుగు కాల్వలో వేయకుండా కార్మికులకు అందజేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. బోసురోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి గుడి వద్ద ఆదివారం మురుగు కాల్వల పూడికతీత పనులు నిర్వహించారు. మురుగు కాల్వల్లో సీసాలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వల్ల మురుగు నీరు పారుదల స్తంభిస్తుందని ఆమె చెప్పారు. దీంతో మురుగు కాల్వలు పొంగి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఆమె వెంట కౌన్సిలర్ తోట రఘురామ్, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, సిబ్బంది ఉన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



విద్యార్థులతో అతిథులు

తెనాలి: చదువు, టాలెంట్‌తో నేటి విద్యార్థి అనే నినాదంతో పట్టణానికి చెందిన వెంపటి సత్యనారాయణ, అయినాల మల్లేశ్వరరావు సారథ్యంలో నిర్వహిస్తున్న 'స్టూడెంట్ సందడి'లో భాగంగా ఆదివారం డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్, మానవత సంస్థ తెనాలి చైర్‌పర్సన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఏదొక కళలో ప్రావీణ్యం సంపాదించాలని సూచించారు. ఫలితంగా మానసికంగా దృఢంగా ఉండగలరని చెప్పారు. కార్యక్రమానికి శశి గ్రూప్స్ అధినేత వుప్పల వరదరాజులు, పద్మశాలి కల్యాణ మండపం అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు సహకరించినట్లు వెంపటి సత్యనారాయణ తెలిపారు. జులైలో ప్రారంభమైన స్టూడెంట్ సందడి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న విద్యార్థులను మల్లేశ్వరరావు అభినందించారు. శ్వేత బృందం యాంకర్లుగా వ్యవహరించారు.

యువత క్రీడలలో రాణించాలి



సన్మాన గ్రహీతలు

మంగళగిరి: యువత విద్యతో పాటు క్రీడలలో రాణించాలని అథ్లెటిక్స్ కోచ్ సత్యనారాయణ పేర్కొన్నారు. నగర పరిధిలోని చినకాకాని ఎన్ఆర్ఐ జంక్షన్ వద్ద ఫంక్షన్ హాలులో విజేత స్పోర్ట్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, అథ్లెటిక్స్ కోచ్ సత్యనారాయణ మాట్లాడుతూ యువతకు క్రీడలలో ఆసక్తిని పెంచేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది రెండు స్పోర్ట్స్ మీట్స్, మూడు మెడికల్ క్యాంపులు, విజేత రన్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం అసోసియేషన్ అభివృద్ధికి సహకరిస్తున్న క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి షేక్ ఖలీల్, ఐ.వెంకటరావు, ప్రతినిధులు ఎం.శ్రీనివాసరావు, బాపూజీ, గద్దె శ్రీను, బాజీ ఖాన్, షేక్ ఖాజావలి, రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.

భక్తులతో కళకళలాడిన కాకాని శివాలయం



క్యూలైన్లలో బారులు తీరిని భక్తులు

పెదకాకాని: కార్తిక దీపాల కాంతులతో పెదకాకాని శివాలయం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. మూడో ఆదివారం రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. ప్రాకార మండపాల్లో కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయం చుట్టుపక్కల ఎటు చూసినా దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులే కనిపించారు. ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తిక దీపాలు వెలిగించి, పూజలు చేసుకునే విధంగా టేబుళ్లు ఏర్పాటు చేశారు. తెల్లవారు జామునే భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. యజ్ఞాల బావి నీటితో పవిత్ర స్నానాలు చేసి కార్తిక దీపాలు వెలిగించారు. పొంగలి నైవేద్యాలతో, ప్రభలతో ఆలయం చుట్టూ హరోం హర అంటూ నామం స్మరిస్తూ ప్రదక్షిణలు చేశారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లలో దాతలు ఉచితంగా వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఆలయంలో అధికంగా అంత్రాలయ అభిషేకాలు, దర్శనాలు, తలనీలాలు సమర్పణ, అన్నప్రాశనలు, నామకరణలు, వాహనపూజలు అధిక సంఖ్యలో జరిగాయి. ఒక్కరోజులో స్వామికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా రూ. 7 లక్షల ఆదాయం, అన్నదానానికి రూ. 10.50 లక్షలు విరాళాలు సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పోలీసు, పంచాయతీ, అగ్నిమాపక, వైద్యశాఖ అధికారులు ప్రత్యేక సహకారం అందించారు.

బాలిక ఆత్మహత్య

గుంటూరు రూరల్: బాలిక ఆత్మహత్యపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. దాసరిపాలెం ఫ్లాట్లకు చెందిన మల్లెల అక్షయ(14) ఓబులు నాయుడుపాలెం పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో స్థానికంగా తాపీ పని చేసే నవీన్ అనే యువకుడు ప్రేమపేరుతో వేధిస్తున్నాడని మనస్తాపానికి గురైన విద్యార్థిని ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గమనించి జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి తండ్రి అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.